## వా టా

"అభినందనలు. మా పజిల్ నెంబరు 356 కు మీరు ఆల్ కరెక్టు ఎంట్రీ పంపారు."

టెలిగ్రాం పదేపదే చదివినా తనివి తీరటంలేదు. సంతోషం పట్టకుండా ఉన్నాడు. కాళ్ళూ చేతులూ తేలిపోతున్నట్టుగా అనుభూతి పొందాను. తను కలలోకూడా అనుకోలేదు. ఎటువంటి అఖండవిజయం! పదివేల రూపాయల బహుమతి. పదివేలు! ఏరోజూ తన నింత గొప్పవాణ్ని చేస్తుందని ఊహించలేక పోయాడు. అదృష్టం అంటే అలా ఉండాలి. అదృష్టం. ఏసుముహూర్తాన పజిల్స్ వేయాలని తనకి బుద్ధి పుట్టిందో! ముహూర్తబలం.

రంగారావు ఆలోచనలు ఆనందాతిరేకంతో తరంగాల్లా ప్రవహిస్తున్నాయి. ఏమీ కష్టపడకుండా మొదటిబహుమానం కొట్టేసి పదివేలకి అధిపతి కాబో తున్నాడు. ఈ డబ్బుపెట్టి ఏం చేస్తే బావుంటుంది తను? ఏదైనా వ్యాపారం చేయవచ్చు.

తను అదృష్టవంతుడు! కలిసొస్తుంది. ఈ ఉద్యోగం వొదిలేస్తే పీడా వొదుల్తుంది. నెలలో నూటయాభై దొరుకుతున్నా బోలెడంత చాకిరీ. ఆమాటకొస్తే చాకిరీ లేకుండా వ్యాపారంమాత్రం ఏం లాభిస్తుంది? ఉద్యోగం చేస్తూనే ఎవర్నన్నా గుమాస్తాని వేసుకొని వ్యాపారం చెయ్యాలి. అప్పుడు రెండువిధాలా కలిసొస్తుంది. అయితే ఏం వ్యాపారం చెయ్యటం? గుడ్డలకొట్టు పెట్టొచ్చు. మొదట చిన్నదే అయితేమాత్రమేం? క్రమంగా అభివృద్ధిపరుచుకోవచ్చు.

పోతే, రెడీమేడ్ డ్రెస్ షాప్ తెరవొచ్చు. కాకపోతే, ఫ్యాన్సీషాప్, కాని వీటన్నిటితో ఓ పెద్దచిక్కు కనిపిస్తోంది. తను ఇరవై నాలుగుగంటలూ కొట్లో కూచోలేడు. అలా కూచోడానికి తనకి తీరదు. ఇహ సరుకు సరిగా అమ్ముడుపోతోందో లేదో తనకి తెలియదు. నమ్మకస్తుడుఐతే ఫరవా లేదు. లేకపోతే ఆ గుమాస్తా సొంతానికి నైవేద్యం పెట్టుకుంటే కొంప మునిగుతుంది.

చూస్తే, ఓ చిన్న ప్రెస్ పెడితే బావుండేట్టుంది. ఈ రోజుల్లో ప్రెస్‌లకి బాగా గిరాకీ తగుల్తున్నట్టుంది. అదీగాక తనకు తెలిసినవాళ్ళూ, కొద్దిమంది మొహమాటస్తులూ, కాస్త పలుకుబడి వున్నవాళ్ళూ ఎలాగో తనకే పని ఇచ్చేట్టు చూడగల పటిమ తనకుంది. భేష్. ప్రెస్ పెట్టేయాలి. అయితే పదివేలకే ప్రెస్ ఎలా సాధ్యం ? తనదగ్గిరో మూడు నాలుగు వేలు న్నాయి. వడ్డీకి బ్యాంకులో వేశాడు. అవసరమైతే తీసి పెట్టుబడి పెట్టొచ్చు. అలాచేస్తే బావుండేట్టుంది.

రంగారావుకి ఆలోచనమీద ఆలోచన లొస్తున్నాయి.

"ఏమోయ్, రంగారావ్ !"

ఉలికిపడి తలెత్తిచూశాడు రంగారావు. ఎదురుగా సుబ్బారావు నుంచుని వున్నాడు. అక్కడేవున్న ఓకుర్చీ ముందుకుతోసి కూచోమన్నట్టు సంజ్ఞ చేశాడు.

"అదృష్టం అంటే అలా ఉండాలోయ్."

రంగారావుకి ఆశ్చర్యం వేసింది. అప్పుడే యీ సంగతి సుబ్బారావు కెలా తెలిసింది ?

"వెయ్యక వెయ్యక నువ్వు పజిల్ వెయ్యటమేమిటి. ఠకీమని ఫస్టుప్రైజ్ రావటమేమిటి ! దెబ్బంటే వీది."

రంగారావుకి కొంచెం గర్వంవేసింది. కాని అదేమీ బయటికి ప్రదర్శింవ లేదు.

"అదృష్టం, కాలం కలిసింది. అంతే" అనిమాత్రం అన్నాడు.

"ఇంతకీ ఇది ఎవరి అదృష్టం అనాలో తెలియటంలేదు" సుబ్బారావు నవ్వుతూ అన్నాడు.

రంగారావు ప్రశ్నార్థకంగా అతనివైపు చూశాడు.

"రోజు లెప్పుడూ ఒకేవిధంగా ఉండవని నువ్వన్నమాట ఇప్పుడు నిజమని తేలింది. నువ్వదంతా మర్చిపోలేదనుకుంటాను."

రంగారావు కొంచెం ముఖం అదోవిధంగా పెట్టి అన్నాడు :

"ఏదంతా"

"ఓరోజు నేను దైనిక సమస్యలతో విసిగి, జీవితంమీద విరక్తి పుడుతోందని నీతో నా గొడవ చెప్పుకుంటే నువ్వేమన్నావు ?"

"ఏమన్నాను ?"

"చెప్పారుగా. తరవాత నువ్విచ్చిన వాగ్దానం. ఆసమయంలో నీముఖంలో ప్రస్ఫుటంగా కనిపించిన నిజాయితీ ఎప్పుడూ మర్చిపోలేను."

రంగారావు ముఖం అకస్మాత్తుగా వాడిపోయింది. యెప్పుడో ఆరునెలల కిందటి సంగతి. తటాలున ఆ విషయం జ్ఞాపకం రావటంతో రంగారావుని అంతకుముందు ఆవరించిన ఆనందం అదృశ్యమై ఆందోళన అలముకుంది. ఆనాటి సాయంత్రం సుబ్బారావుకీ తనకీ జరిగిన సంభాషణ అతని మనసులో మెదిలింది. సుబ్బారావు నిజానికి బొత్తిగా లేనివాడు. జీవితం మీద విరక్తి పుడుతోందని తన గొడవంతా చెప్పుకుంటే తనకి కొంచెం చిరాకువేసింది.

"ఏం చేస్తాం నాకే పజిల్లోనో ఓ పదివేలొస్తే సగం నీకిచ్చేద్దును," న్నాడు తను కొంచెం విసుగు వ్యక్తపరుస్తూ. సుబ్బారావు నవ్వాడు

"ఇవ్వవు" అన్నాను. తనకి కొంచెం కోపంవచ్చింది. జీవితంలో బాధ పడేవాళ్ళంతా వొట్టి సినిక్సుగా తయారవుతారు. నిజానికి తను అన్నది వ్యంగ్యభావంతోనైనా సుబ్బారావలా మొహంమీద అనేసినందుకు తనకి అభిమానంవేసింది.

"ఎందుకివ్వను తప్పక ఇస్తాను" అన్నాడు తను.

సుబ్బారావు విషాదంగా నవ్వి "అదంత సులభవిషయం కాదోయ్. పోనీలే ఇప్పుడెందుకా సంగతి" అన్నాడు.

కాని తనకే పట్టుదల హెచ్చింది. తప్పక యిస్తానని మాటయిచ్చాడు. అతడేమీ మాట్లాడలేదు. తనని కొంచెంసేపు పొగిడాడు. ఆ పొగడ్త విన గానే తనకి అతనిమీద కొంచెం సానుభూతికూడా కలిగింది. అవును తను కాస్తోకూస్తో ఉన్నవాడు. నిరాక్షేపణీయంగా బ్రతకటానికి అవకాశాలున్న వాడు. సుబ్బారావు ఎంతో దీనావస్థలో ఉన్నాడు. తను సహాయం చెయ్య గలిగితే తప్పక చేస్తాడు. కాని తనకిమాత్రం ఊరికే డబ్బెవడిస్తాడు ?

రంగారావు నిట్టూర్పు విడిచాడు. ఆ పూర్వపు సంఘటనగురించి ఆలో చించటం మానేసి సుబ్బారావువైపు చూశాడు. అతని ముఖంలో వ్యంగ్య భావం యేదో స్ఫురిస్తున్నట్టు రంగారావుకి అనుమానం వేసింది. ఇందాక అతనన్న మాటలుకూడా వ్యంగ్యాత్మకంగానే ఉన్నాయనే అనుమానం కలిగింది అతనికి. అతని మనసు కొంచెం చివుక్కుమంది. ఆత్మాభి మానం ముంచుకొచ్చింది. పోనీ, అతని వాటా ఇచ్చేస్తే ? అయిదువేలా! ఆ అయిదువేలతో నిస్సందేహంగా బాగుపడతాడు. నిజమే కాని తన ప్లానంతా మట్టిలో కలిసిపోతుంది. ప్రెస్ పెడదామనుకున్నాను, అదంతా అడియాసవుతుంది. అయిదువేలంటే, మాటలా ? అయినా సుబ్బారావుకి తను ఏవిధంగా బాకీ ఉన్నాడు ? ఏదో అప్పిద్దామనిపించింది.

తానేమీ హరిశ్చంద్రుడు కాడు. కాని అభిమానం ? రంగారావు ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాడు. సుబ్బారావుకి అప్పుడే ఈ విషయం యెలా

తెలిసిందో ? గొంతుమీద కూచున్నాడు. తన కాలోచనకూడ పోరటం లేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?"

తల వొంచుకునే జవాబిచ్చాడు రంగారావు.

"ఏమీ లేదు."

"రంగారావ్, నిజంగా నేను అదృష్ట వంతుణ్నే. కాకపోతే నీలాంటి స్నేహితుడెలా దొరుకుతాడు నాకు ? మనకు విధి అనుకూలించి, నీకా ప్రైజు రాబట్టిగాని లేకపోతే ఆ గానుగెద్దు జీవితంనించి నాకు విముక్తి దొరికేదికాదు."

రంగారావుకి చర్రున కోపంవచ్చింది.

"ఏమిటి నువ్వనేది? "

"ఏముందీ ? అదే. ఐదువేలొస్తాయి గదా అని...."

"ఎవరికి ?" అన్నాడు కొంచెం కటువుగా రంగారావు.

సుబ్బారావు కొంచెం ఆశ్చర్యంగా ముఖంపెట్టి "మర్చిపోయావా?" అనడిగాడు రంగారావు ముఖంలోకి చూసి.

"ఏమిటో చెప్పరాదూ ?"

"నీకు ప్రైజ్ ఏదైనా వొస్తే సగం ఇస్తానన్నావుగా."

తక్షణం రంగారావు జవాబేమీ ఇవ్వలేక పోయాడు. సుబ్బారావుమీద అతనికి చెప్పలేనంత అసహ్యంవేసింది. తను పొరపాటునో, ఉద్రేకంలోనో. జాలితోనో అన్న మాటల్ని—తనచేత పట్టుపట్టి అనిపించిన మాటల్ని—తనకి సాధ్యమైనంత లాభకరంగా, అన్యాయంగా వినియోగించుకోటానికి చూస్తున్నాడు సుబ్బారావు. అతనికే ఆ మాత్రం విచక్షణాజ్ఞానం లేకపోతే, అతనికోసం తనెందు కనవసరంగా నష్టపడాలి ? ఐనా కొంచెం ముందు వెనుకలాలోచించి, నెమ్మదిగా అన్నాడు రంగారావు.

"సగం అన్నానా?"

"అన్నావు." నిర్మొహమాటంగా జవాబిచ్చాడు సుబ్బారావు.

ఏదో కాస్తోకూస్తో సహాయం చేద్దామని రంగారావు అభిప్రాయం. కాని యీ జవాబుతో అతనుకూడా మొహమాటం వెనక్కు నెట్టేశాడు.

"కొన్ని బాకీలున్నాయోయ్. అవిగాక ప్రెస్ ఓటి పెట్టాలనుకున్నాను. అది కొంచెం బాగానడిస్తే నీసంగతి మర్చిపోతానా?" గోడమీద పిల్లివాటంగా అసలుసంగతి బయటపెట్టాడు రంగారావు.

సుబ్బారావు ఓక్షణం ఊరుకుని నిరాశ పడ్డట్టుగా అన్నాడు. ఐతే ఏమీ యివ్వలేవా?"

"పరిస్థితులు...."

ఏమిటో చెప్పబోతున్న రంగారావుని సుబ్బారావు నివారించాడు.

"అనుకున్నట్టే అయింది. పోనీలే నేనేమీ అనుకోను, వొస్తా."

వెళ్ళిపోయాడు సుబ్బారావు. రంగారావు మనసులో కొంచెం వెలితిగా ఉన్నట్టు అనుభూతి పొందాడు. కాని ఎలాగో సరిపుచ్చుకుని ఆ విషయం ఆలోచించటం అంతటితోనే మానేశాడు. చూస్తూచూస్తూ అయిదువేల రూపాయలు తనెలా వొదులుకో గలడు?

మర్నాటి ఉదయం పోస్టులో ఉత్తరం చూసుకున్నాడు రంగారావు.

ఆల్ కరెక్టు ఎంట్రీలు పంపిన యిద్దరిలో ఒకరైనందుకు రంగారావును అభినందిస్తూ బహుమతిమొత్తం త్వరలో పంపుతామని రాశారు పజిల్ నిర్వాహకులు.

బహుమతి మొత్తానికి మరో పోటీదారు వుండటంచూసి, రంగారావు ఉత్సాహం సగం తగ్గిపోయింది. కాని కొంచెంసేపు ఆలోచించిన మీదట రంగారావు సర్దుకున్నాడు. ఇద్దరితోనే సరిపోయింది. ఇంకా ఎక్కువ

మందికి ఫస్ట్‌ప్రైజ్ వొస్తే తనేంచేసేవాడు? ఎంచేతో యిలాంటిది సంభవమని మొదట తనకి తట్టలేదు. ఏమైనా కనీసం అయిదువేలైనా వొచ్చాయి. ఇంకానయం. సుబ్బారావుకి వాటాపెడితే తనకి మిగిలేది వెధవ రెండువేల అయిదువందలు.

సుబ్బారావుని గురించి అనుకుంటూండగానే అతనొచ్చాడు. అతన్ని మళ్ళీ చూసి రంగారావు కొంచెం విసుక్కున్నాడు. అతని యేడుపే కొట్టింది తనకి!

"చూశావా? ఏమిటో నాకు పెద్ద వొచ్చి పడ్డదనుకున్నావు. ముష్టి అయిదు వేలు. యింతాచేసి. ఇంకెవరికో కూడా ఫస్ట్‌ప్రైజ్ వొచ్చిందిట" అన్నాడు విసురుగా రంగారావు.

సుబ్బారావు తాపీగా కూర్చుని నెమ్మదిగా అన్నాడు.

"రెండో అతనెవరు?"

"ఏమో యెవరికి తెలుసు?"

"నాకు తెలుసు."

"నీకా! యెవరు?"

"నేనే."

రంగారావు దిగ్భ్రాంతుడయాడు. సుబ్బారావు వేళాకోళ మాడుతున్నాడేమోనని అనుమానం వేసిందతనికి. కాని వేళాకోళమేమీ లేదన్నాడు సుబ్బారావు "నువ్వుకూడా పజిల్‌కి కట్టావన్న మాట.'

'ఆహా. ఇందులో నా ప్రయోజకత్వమేమీ లేదులే. నీ ఎంట్రీ నాకు చూపించావుకదూ? ఎందుకో నాకు గట్టి నమ్మకం కలిగింది.—అది చాలా సమంజసంగా వుందని నేనూ అలాగే వేశాను. సరిగా."

"నువ్వుకూడా వేస్తావనుకోలేదు."

"నేనూ అనుకోలేదు. కాని సమయానికి మనసు వక్రించింది. రంగారావ్ నిన్నేమీ ఆక్షేపించాలని నా ఉద్దేశం కాదు. కాని ఓసంగతి చెబుతున్నాను. ఇలా చెప్పే అవకాశం రావటం నిజంగా తమాషాగానే వుంది."

రంగారావు కిదేమీ నచ్చలేదు. విసుక్కున్నాడు.

"చెప్పేదేదో ఉపోద్ఘాతం లేకుండా చెప్పు."

సుబ్బారావు వెంటనే అందుకున్నాడు :

"నీకేదో ఊరికే వస్తే పంచిపెడతానన్నావు. అలా అనటం చాలమంది కలవాటు. కాని అరుదుగా లభించే ఆనందంలో భాగం పెట్టటం అంత సులభంకాదు. నిజంగా యివ్వగలవాడలా అనలేదేమోకూడా, సరే అదలా ఉంచు. నిన్న ఐదువేలు సరిపెట్టుకోలేనివాడివి ఇవాళ సరిపెట్టుకోగలిగావని నీ ముఖంచూస్తేనే తెలుస్తోంది. అంతేకాదు, రేపింకా తక్కువ వస్తుందని తెలిసినా ఏవో సమాధానం చెప్పుకుని సరిపెట్టుకుంటావు, అంతకంటే గత్యంతరం లేదుగనక. కాని పంచియివ్వటంవల్ల అలా వొదులుకోవాల్సివస్తే మదనపడి బాధపడతావు. సహాయంచేశారనే ఆత్మతృప్తి కంటె దానివల్ల వచ్చే నష్టంవల్ల కలిగే విచారమే ఎక్కువౌతుంది. నీ ప్రమేయం లేకుండా జరిగిపోతేనే నీకు తృప్తి. నీ వ్యక్తిత్వాన్ని నువ్వే తక్కువచేసుకుని అగౌరవపరచుకుంటున్నావు. రంగారావ్, ఇంత స్పష్టంగా చెప్పినందుకు క్షమించు."

(1954)

— o —